




# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 26-04-2024 సంపుటి : 06 సంచిక : 225 పేజీలు : 8 వెల : రూ 3-00


# పులివెందులలో నామినేషన్ వేసిన జగన్



- జై జగన్ నినాదాలతో మార్మోగిన పులివెందుల
- పసుపుమూకలతో చేతులు కలిపిన చెల్లెమ్మలు
- కుట్రలు చేసిన వారితో చేతులు కలిపిన వారు వారసులా?
- అవినాశ్ రెడ్డి ఎలాంటి తప్పూ చేయలేదని వ్యాఖ్య
- చెల్లెళ్లపై ఘాటుగా విమర్శలు చేసిన సిఎం జగన్








కడప,ఏప్రిల్25 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ పులివెందుల అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. గురువారం ఉదయం పులివెందులలోని మినీ సెక్రటేరియట్‌లోని ఆర్వో ఆఫీస్‌లో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. సీఎంతో కడప ఎంపీ అవినాశ్ రెడ్డి ఉన్నారు. అంతకుముందు ఆయన స్థానిక సీఎస్ఐ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభలో సీఎం జగన్ పాల్గొన్నారు. చంద్రబాబు కుట్రలను ఎండగట్టిన జగన్.. పులివెందుల తన ప్రాణం అంటూ భావోద్వేగంగా ప్రసంగించారు. వైఎస్సార్ కుటుంబ సభ్యులుగా చెప్పుకుంటూ రాజకీయం చేస్తున్న కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి షర్మిల, ఆమెకు మద్దతుగా నిలిచిన వివేకా కూతురు సునీతలపై విమర్శలు సంధించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ అవినాష్ రెడ్డి పాల్గొన్నారు. సీఎం జగన్ పర్యటన సందర్భంగా పులివెందుల జై జగన్ నినాదాలతో మార్మోగిపోయింది. స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ.. పులివెందుల నా ప్రాణం అంటూ భావోద్వేగంగా ప్రసంగించారు. అదే సమయంలో చంద్రబాబు అండ్ కో కుట్రలను జగన్ ఎండగట్టారు. వైఎస్సార్ కుటుంబ సభ్యులుగా చెప్పుకుంటూ రాజకీయం చేస్తున్న కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి షర్మిల, ఆమెకు మద్దతుగా నిలిచిన వివేకా కూతురు సునీతపై జగన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తన చిన్నాన్న వివేకాను చంపిన వాళ్ళెవరో ప్రజలకు తెలుసని, అవినాష్ రెడ్డి జీవితాన్ని నాశనం చేయాలని ప్రయత్నిస్తున్నారని జగన్ ధ్వజమెత్తారు. దివంగత వైఎస్సార్‌పై కుట్రలు చేసిన వారితో తన చెల్లెమ్మలు చేతులు కలపడం దుర్మార్గమని, ప్రజలు ఈ చెడిపోయిన రాజకీయాల్ని గమనిస్తున్నారని పేర్కొన్నారు. కష్టకాలంలోనూ పులివెందుల తనకు అండగా నిలిచిందని, నియోజకవర్గానికి మెడికల్ కాలేజీ కలను త్వరలోనే సాకారం చేస్తానని చెప్పారు. వైఎస్ వివేక హత్య కేసులో తనపై తన పార్టీ అభ్యర్థి అవినాష్‌పై వస్తున్న ఆరోపణలపై స్పందించారు. ఈ కేసులో అవినాష్ ఎలాంటి తప్పు చేయలేదని నమ్మాను కాబట్టే ఆయనకు టికెట్ ఇచ్చానని స్పష్టం చేశారు. ఈ కేసులో అవినాష్ ప్రమేయం ఉందన్న సునీత, షర్మిల కామెంట్స్‌కు పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. పసుపు మూకలతో చెల్లెమ్మలు చేతులు కలపారని ఆరోపించారు. తనను నేరుగా ఎదుర్కోలేక అంతా కలిసి ఒక్కసారి దాడి చేస్తున్నారని వాపోయారు. అందుకే వివేక హత్య కేసును తెరపైకి తీసుకొచ్చి అవినాష్‌ను టా÷-గ్గ్÷ట్ చేశారని అన్నారు. అవినాష్‌ను నాశనం చేయాలని రాజకీయాల నుంచి ఎలిమినేట్ చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. పులివెందుల కల్చర్, కడప కల్చర్, రాయలసీమ కల్చర్ అంటూ అవాక్కులు పేలుతున్నారని విమర్శించారు జగన్. అలాంటి సంస్కృతి తమకు లేదన్నారు జగన్. మంచి చేయడం మంచికి అండగా నిలబడటమే తెలుసున్నారు. నాలుగు దశాబ్దాలుగా టీడీపీ అక్రమాలను ఎదుర్కొంటి ఈ పులివెందుల బిడ్డలే అన్నారు. పులివెందుల అంటే అభివృద్ధికి, నమ్మకానికి నిదర్శనమని అన్నారు. ఇదో సక్సెస్ స్టోరీ అని చెప్పుకొచ్చారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తలపెట్టిని అభివృద్ధిని మరో రెండు అడుగులు ముందుకే తీసుకెళ్లామన్నారు. అలాంటి పులివెందులలో వైఎస్, జగన్ ముద్రలేకుండా చేయాలని కొందరు కుట్ర పన్నారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి యత్నిస్తున్నారని అన్నారు. వారి కుట్రలో భాగంగానే కొందురు వైఎస్ వారసులమని ముందుకొస్తున్నారని సునీత, షర్మిలను ఉద్దేశించి విమర్శించారు. అలాంటి వాళ్లకు బుద్ధి చెప్పాల్సింది, వైఎస్‌కు నిజమైన వారసులెవరో చెప్పాల్సింది ప్రజలే అన్నారు. అలాంటి ప్రజల్లో తనకు మంచి పేరు ఉందని దాన్ని తట్టుకోలేక తన ఇద్దరు చె÷-లలెళ్లతో కలిసి పచ్చ మూక కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. వైఎస్ కుటుంబాన్ని టార్గెట్ చేసిందెవరో... ఆయనపై కేసులు పెట్టిందెవరో... విగ్రహాలు తొలగిస్తామన్నదెవరో ప్రజలకు బాగా తెలుసున్న జగన్... అలాంటి వారితో చేతులు కలిపిన వ్యక్తులు వైఎస్ వారసులు ఎలా అవుతారని అన్నారు. పసుపు చీరలు కట్టుకొని వైఎస్ఆర్ శత్రువులతో చేతులు కలిపిన వారు వారసులా అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని విడగొట్టిన కాంగ్రెస్‌కు ఎవరు ఓటు వేస్తారని ప్రశ్నించారు. తమ ఓట్లు చీలిస్తే ఎవరికి ప్రయోజనమో గుర్తించాలని ప్రజలకు సూచించారకు. తన చిన్నాన్నను చెప్పింది ఎవరో దేవుడికి, జిల్లా ప్రజలకు బాగా తెలుసు అన్నారు జగన్. నిందితులకు ఎవరు మద్దతు ఇస్తున్నారని కూడా తెలుసు అన్నారు. వివేకాకు రెండో భార్య సంతానం ఉన్నది నిజం కాదా అని ప్రశ్నించారు. హత్య జరిగిన రోజు ఎవరు ఫోన్ చేస్తే అవినాష్ అక్కడకు వెళ్లారో... పదే పదే మీడియాలో ఆయన సంధిస్తున్న ప్రశ్నలు నిజం కాదా అని నిలదీశారు. అన్యాయంగా నాడు ఎన్నికల్లో ఓడించిన వాళ్లే ఇప్పుడు కుట్రలు చేస్తున్నారని... వారిచ్చిన స్క్రిప్టులనే వీళ్లు చదువుతున్నారని అన్నారు. అలాంటి వాళ్లు వైఎస్ వారసులు ఎలా అవుతారని ప్రశ్నించారు.

# వైసీపీని తొక్కేద్దాం.. కూటమిని తెచ్చేద్దాం

## జనసేన అధినేత పవన్ కళ్యాణ్



అన్నమయ్య జిల్లా,ఏప్రిల్25: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రజలకు కీలక పిలుపునిచ్చారు. వైసీపీని పాతాళంలోకి తొక్కి.. కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఏపీలో వైసీపీ పాలనలో రాష్ట్రంలో రౌడీయిజం పెరిగిపోయిందని జనసేనాని ఆరోపించారు. అన్నమయ్య జిల్లాలో కూటమి అభ్యర్థి, మాజీ సీఎం నల్లా కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి టీడీపీ అధినేత చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఉమ్మడి సభలో పవన్ కళ్యాణ్ మాటా్లడారు. యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యం అవుతుందని.. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. అన్నమయ్య జిల్లాలో 39 మంది చావుకు వైసీపీనే కారణం అని ఆరోపించారు. అన్నమయ్య డ్యామ్ నుంచి ఇసుకను అక్రమంగా తరలించడం ద్వారా డ్యామ్ ప్రమాదంలో పడిందని.. దాని కారణంగా 39 మంది చనిపోయారని పవన్ కళ్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డిలను ఘోరంగా ఓడించాలని పవన్ కళ్యాణ్ ప్రజలకు పిలుపునిచ్చారు. వైసీపీని పాతళంలోకి తొక్కి.. కూటమిని గెలిపించాలని కోరారు.కూటమిఅధికా రంలోకి వస్తే రాజంపేట ప్రాంతాన్నిటెంపుల్‌టూరిజంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసమే కూటమి ఏర్పడిందని మరోసారి పవన్ కళ్యాణ్ వెల్లిడంచారు. వైసీపీ ని చూసి ప్రజలు భయపడ కుండా బయటకు వచ్చి ఓటు వేయాలని కోరారు. దీంతో వైసీపీ ప్రభుత్వం తుడిచిపెట్టుకుపోవాలని కోరారు.

# రాజధాని లేకపోవడమే రాష్ట్రానికి దుస్థితి-షర్మిల



విజయవాడ,విజయవాడలో ఎన్నికల ప్రచారంలో బాగంగా సభలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి పాల్గోన్నారు. వైఎస్ షర్మిలా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని లేదు. రాజధాని లేని రాష్ట్రం ఎక్కడా లేదు. మన రాష్ట్రానికే ఈ దుస్థితి. మనకు చేతిలో చిప్ప తప్పా ఏమి లేదు. సింగపూర్ అన్నాడు చంద్రబాబు. 3డి గ్రాఫిక్స్ చూపించారు. 30 వేల ఎకరాలు తీసుకున్నారు. 2015 లో మోడీ వచ్చి భూమి పూజ చేశాడు. యమునా నది నుంచి మట్టి తెచ్చాడు. మనకు మిగిలింది చివరికి మట్టి, డిల్లీ తలదన్నే రాజధాని ఉండాలని మోడీ చెప్పాడు. బాబు సింగపూర్ లాంటి రాజధాని అన్నాడని అన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవ రాజధాని అన్నాడు. అమరావతి కాస్త చివరికి భ్రమరావతి చేశాడు. - హైదరాబాద్ నేనే కట్టా అన్నాడు. హైదరాబాద్ మించిన రాజధాని అని మళ్ళీ చెప్పాడు. బాబు హయాంలో తాత్కాలిక భవనాలు తప్పా మిగిలింది ఏమి లేదు. దేశ విదేశాలు తిరిగాడు తప్పా... పెట్టుబడులు రాలే. ఉద్యోగాలు లేవు..పరిశ్రమలు లేవు. ఇక జగన్ మోహన్ రెడ్డి గెలిస్తే వాసింగ్ టన్ టఃా అన్నాడు. తర్వాత ఒక్కటి కాదు మూడు అన్నాడు. మూడు కాదు కదా ఒక్క రాజధానికి దిక్కులేదని అన్నారు. 10 ఏళ్ల క్రితం ఎలా ఉందో ఇప్పుడు అలానే ఉంది. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. రాజధాని కి సహాయం చేస్తామని బీజేపీ మోసం చేస్తే... మళ్ళీ వాళ్ల కొంగు పట్టుకొని తిరుగుతున్నారు. ఎందుకు నిధులు ఇవ్వలేదు అని అడిగిన వాళ్ళు లేరు. మోడీ కోసం చేస్తే నిలదీసే దమ్ము లేదు. ఈ సారి బాబు కి ఓటు వేసినా,జగన్ కి వేసినా డ్రైనేజీ లో వేసినట్లే. మనకు రాజధాని కావాలి అంటే...కాంగ్రెస్ రావాలి. పోలవరం కట్టాలి అంటే రాజధాని రావాలని అన్నారు. మనకు ఈ పొత్తులు, తొత్తులు వద్దు. కాంగ్రెస్ అధికారంలో వస్తేనే రాష్ట్ర అభివృద్ధి వుంటుందని అన్నారు.

# టీడీపీకి బిగ్ షాక్..

## వైఎస్సార్‌సీపీలోకి కీలక నేతలు

వైఎస్సార్ : ఎన్నికల వేళ టీడీపీకి వరుస షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. మాటపై నిలబడే నాయకుడి సారథ్యంలో పనిచేసేందుకు కూటమి పార్టీల నేతలు క్యూ కడుతున్నారు.పార్టీ కార్యకర్తల మనోభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఇతర పార్టీల నేతలను వైఎస్సార్ సీపీలోకి చేర్చుకుంటున్నారు. తాజాగా, పులివెందులలో సీఎం జగన్ సమక్షంలో చిత్తూరు జిల్లాకు చెందిన టీడీపీ నేత, మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, సోదరుడు శ్రీనాథ్ రెడ్డి దంపతులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. గత ఎన్నికల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై పుంగనూరులో టీడీపీ తరపున శ్రీనాథ్ రెడ్డి భార్య అనీషా రెడ్డి పోటీ చేశారు.కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం పులివెందులలో నామినేషన్ వేయడానికి వెళ్లిన సీఎం జగన్ సమక్షంలో ఆయన వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు.



# సంపాదకీయం

శుక్రవారం 26-04-2024

## ఆమ్ ఆద్మీ పార్టీ భవిష్యత్తు ఏంటీ....

దేశ రాజధాని ఢిల్లీ పాలన అనిశ్చితంగానే కొనసాగుతున్నది. ఆప్, బిజెపి రాజకీయ వ్యూహ, ప్రతివ్యూహాల మధ్య ఢిల్లీ గమ్యం ఎటు, ఈ ప్రభుత్వ భవితవ్యం ఏమిటన్నది ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఆప్ ఇటీవలి వరుస ఎన్నికల పరాజయాల వల్ల రాజకీయంగా పగిలిపోయింది మరియు ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం చారిత్రక ఆదేశాన్ని నాశనం చేసిందని బీజేపీకి ప్రధాన ప్రతిపక్షంగా నిలిచే సువర్ణావకాశాన్ని పూర్తిగా తిరస్కరించే స్థితిలో ఉంది. ఘర్షణాత్మక ఎన్‌కౌంటర్లు మరియు వ్యతిరేక రాజకీయాలు వారి ఎన్నికల పునాదిని క్షీణింపజేశాయి. ఢిల్లీలో మే 25న ఎన్నికలు జరగబోతుండడంతో ఈ అనిశ్చిత పరిస్థితులకు కారణమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తీహార్ జైలు నుంచి పాలన సాగించేందుకు జైలు నిబంధనలు అనుమతించకున్నా ఆయన అక్కడి నుంచే పాలన సాగిస్తున్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా చెబుతూ ప్రత్యామ్నాయ ముఖ్యమంత్రిని ఎన్నుకోవాలని కోరుతున్నారు. రాష్ట్రపతి పాలన తప్పదని ఆయన హెచ్చరిస్తున్నారు. తన స్థానంలో మరో ముఖ్యమంత్రిని ఎన్నుకునే అవకాశమున్నా బిజెపి రాష్ట్రపతి పాలన విధిస్తే అది ఎన్నికల్లో తమకు అనుకూలిస్తుందని కేజ్రీవాల్ ప్రత్యామ్నాయ సిఎంను ప్రకటించడం లేదు. ఇది గ్రహించిన బిజెపి కూడా రాష్ట్రపతి పాలనకు తొందరపడడం లేదు. దీనితో ఢిల్లీ పాలన గందరగోళం మరి కొంత కాలం కొనసాగే అవకాశాలున్నాయి. ఈ కేసులోని విచారణపరమైన అంశాలతో సంబంధం లేకుండా కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని నిర్ధారించడానికి వీలులేని పరిస్థితి ఎదురైంది. దీంతో ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం అగ్నిపరీక్షలో పడింది. కేజ్రీవాల్ జైలులో ప్రతివారం ఇద్దరు మంత్రులతో ఆయా విభాగాలకు సంబంధించి పాలనా పరమైన అంశాలపై చర్చిస్తారని, సమీక్షించి ఆదేశాలు జారీ చేస్తారని ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రకటించింది. జైలు మేన్యువల్ నిబంధనల ఆచరణ చర్చకు దారి తీసింది. జ్యుడీషియల్ కస్టడీలో ముఖ్యమంత్రులు ఉన్నప్పుడు కల్పించిన అవకాశాలను ఆసరా చేసుకుని కేజ్రీవాల్ జైలు మేన్యువల్ గ్యాప్‌ను ఉపయోగించుకుంటున్నారని, జైలు అధికారులు కూడా దీనికి అనుమతిస్తున్నారన్న అభిప్రాయం వస్తోం ది. అయితే జైలు మేన్యువల్ కార్యాచరణ (మోడస్ ఆపరెండి) అలా లేదు. ముఖ్యమంత్రిగా జైలులో బాధ్యతలు నిర్వర్తించే అవకాశం అది కల్పించడం లేదు. కేబినెట్ సమావేశాలు నిర్వహించడం కానీ, ఫైళ్లను సమీక్షించడం కానీ జైలు మేన్యువల్ ప్రకారం వీలుకాదు. ముఖ్యమంత్రిగా కొనసాగడానికి కేజ్రీవాల్‌కు చట్టపరమైన అర్హత ఉన్నప్పటికీ, ఆ విధంగా విధులు నిర్వహించడానికి జైళ్ల మార్గదర్శకాలు ఒప్పుకోవు. ఈ విషయంలో ఖైదీల హక్కుల పరంగా జైలు మేన్యువల్ చాలా నిర్మాణాత్మకంగా ఉంది. విచారణలో ఉన్న ఖైదీలు తమ కుటుంబీకులకు, సన్నిహిత బంధువులకు, స్నేహితులకు, న్యాయవాదులకు ఆస్తికి సంబంధించిన వివాదాలపైనే సమాలోచనలు చేయవలసి ఉంటుంది. అలాగే ఆ మేరకు లిఖితపూర్వకంగా డాక్యుమెంట్లపై సంతకాలు చేయడానికి వీలుంటుంది. అంతేకానీ రాజకీయ చిక్కులతో ముడిపడి ఉన్న ఏ వ్యవహారంపైనయినా, సంబంధిత డాక్యుమెంట్లపై సంతకం చేయరాదు. ఈ నిబంధన జైలులో ఉన్న ఏ ముఖ్యమంత్రికైనా వర్తిస్తుంది. ముఖ్యమంత్రిగా సమర్ధవంతంగా పనిచేసే అవకాశం ఈ నిబంధన కల్పించదు. ఈ కారణంగానే భూమి వ్యవహారంలో మనీలాండరింగ్ కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను గత ఫిబ్రవరిలో ఇడి అరెస్ట్ చేసినప్పుడు ముఖ్యమంత్రిగా పాలన సాగించలేని పరిస్థితి ఏర్పడింది. అరెస్ట్ అయిన తరువాత ముఖ్యమంత్రిని ఎన్నుకోవలసిన అవసరం ఏర్పడింది. రెండు రోజుల తరువాత జార్ఖండ్ ముక్తిమోర్చా నేత చంపాయి సోరెన్‌ను అక్కడి ప్రభుత్వం ముఖ్యమంత్రిగా నియమించుకుని ప్రమాణ స్వీకారం చేయించింది. నిబంధనల ప్రకారం లెజిస్లేటివ్ సభ్యుడు ఎవరైనా ఏదైనా కేసుల్లో అరెస్ట్ అయినప్పుడు జైలు నుంచి శాసన సభ స్పీకర్‌తో మాత్రమే సంప్రదింపులు జరపవలసి ఉంటుంది. కేజ్రీవాల్ విషయంలో అలా ఏం జరగడం లేదు. తన వారసునిగా ముఖ్యమంత్రి బాధ్యతలు చట్టపరంగా ఎవరికీ అప్పగించలేదు. అధికారికంగా ప్రభుత్వంలో ఎలాంటి హోదాలేని తన భార్య సునీతకు, పార్టీ ఎంఎల్‌ఎలకు, కార్యకర్తలకు జైలు నుంచే ఆదేశాలు అందిస్తున్నారు. తనతో పాటు ఆరుగురే తన ఆదేశాలు అమలు చేసేవారిగా కేజ్రీవాల్ చెబుతున్నారు. ఈ ఆరుగురిలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా ఉన్నారు. కానీ చట్టపరంగా ఇదెంత వరకు ఆచరణయోగ్యం అన్నది ప్రశ్న. ఢిల్లీలో ఇప్పుడు రాజ్యాంగపరమైన పాలన విచ్ఛిన్నమైందన్న వాదన వస్తోంది. 1991లో రాజ్యాంగంలో చేరిన ఆర్టికల్ 239 ఎబి ఆధారంగా లెఫ్టినెంట్ గవర్నర్ ఢిల్లీలో పరిపాలన నిబంధనల ప్రకారం సాగడంలేదని చెబుతూ రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేసే అవకాశం కూడా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోఅసాధారణ పద్ధతిలో ఢిల్లీ పాలనా వ్యవహారాలను ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సాగించడం తనతోపాటు తన పార్టీని రాష్ట్రపతి పాలన చట్రంలో ఇరుక్కునేలా చేయడమవుతుంది. అందుకని ముఖ్యమంత్రి పదవి నుంచి కేజ్రీవాల్ వైదొలగి, లోక్‌సభ ఎన్నికల ప్రచారంపైనే దృష్టి కేంద్రీకరిస్తే చట్టపరమైన చిక్కులు తగ్గుతాయని రాజకీయ పరిశీలకులు సూచిస్తున్నారు

# వైసీపీ పార్టీ తోనే రాష్ట్ర అభివృద్ధి

### వైసీపీ అభ్యర్థి శిల్పా రవి రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 25–వైసీపీ పార్టీ తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం 8 గంటల నుండి 29వ వార్డు షాదిక్ నగర్ లో వార్డు కౌన్సిలర్ మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, వార్డు ఇంచార్జ్ జలీల్ భాషా ఆధ్వర్యంలో వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భారీ జన సందోహం మధ్య..పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజల ఆత్మీయ, ఆదరాభిమానాల మధ్య ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జగన్ పాలనలో జరిగిన మేలును ఇంటింటా వివరిస్తూ, ప్రజారంజక పాలన కోసం మరలా వైఎస్ఆర్ సిపి ని ఆదరించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూజగన్ తోనే సంక్షేమ రాజ్యం సాధ్యమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం జగన్ నెరవేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లు శ్రీధర్, పామ్ షావలి, రాష్ట్ర దృశ్యకతల డైరెక్టర్ సునీత అమృతరాజ్, రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, రత్నబాబు చౌదరి,మహబూబ్ బాషా ,చాంద్ బాషా, హుస్సేన్ బాషా ,జాకీర్ ,షఫీ, మళ్ళీ, హరి ,బాదుల్లా, నూరు వలి, అల్లా బకాస్, హుస్సేన్ వలి ,ఎగ్ బాల్, చిన్ను, ఉస్మాన్ ,అప్పన్న, సద్దాం ,రషీద్, హుస్సేన్ ,కరిముల్లా, రియాజ్ ,అనీఫ్ ,ఇంతియాజ్, మా భాష, రంగారావు, ప్రసాద్, శ్రీనివాసులు, జయన్న, నజీర్, మరియు వార్డు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాసిరకం విత్తనాలకు నంద్యాల మారు పేరు

### మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 25– నాసిరకం విత్తనాలకు నంద్యాల మారు పేరు చేసిన ఎంపీ పోచా ను ప్రజలు ఎన్నటికి మరువలేరని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు . నంద్యాల పార్లమెంట్ పరిధిలో ఎంపీ పోచా ఎలాంటోడో అందరికీ తెలుసు అని ఆయన అన్నారు. నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ . బైరెడ్డి శబరి ఎన్నికల కార్యాలయంలో గురువారం బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి బాధిత రైతుల సమక్షంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బైరెడ్డి మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో పోచా బ్రహ్మానందరెడ్డి నాసిరకం విత్తనాలు రైతులకు అంటగట్టి తీవ్రంగా నష్టపుచ్చుతే భాదితులకు న్యాయం చేసేందుకు పంచాయతీ తానే చేసి పోచా తో రైతులకు నష్టపరిహారం చెల్లించేలా చేసానన్నారు. సొంత మండలం ఉయ్యాలవాడ, నీకు పరిశ్రమలు ఉన్న నంద్యాల మండలం చాబోలు, దొర్నిపాడు మండలం చాకరాజువేముల తదితర గ్రామాల నీ భాధిత రైతులతో ఈ రోజు విలేకరుల సమావేశం పెట్టానని, కనీసం ఆ రైతుల గోడు వినయ్య పోచా అంటూ బైరెడ్డి బాధితులతో వారి ఆవేదనను వినిపించారు .110 ఏళ్ల సుధీర్ఘ కాలం నంద్యాలకే కాకుండా దేశ, విదేశాలలో నాణ్యమైన విత్తనాలు అందిస్తూ ఇటు రైతు లకు, అటు దేశానికే సేవ చేస్తున్న నంద్యాల ఆర్ ఎ ఆర్ ఎస్ ను కక్షగట్టి శాస్త్రవేత్తల పరిశోధన ఫలితాలు రైతులకు దక్కకుండా చేసిన ఘనత ఎంపీ పోచా కే దక్కుతుందని బైరెడ్డి అన్నారు. అధికార బలంతో నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు గుణపాఠం చెబుతారని ఎంపీ పోచాను బైరెడ్డి హెచ్చరించారు.

# బైరెడ్డి కుటుంబాన్ని విమర్శించే అర్హత ఎంపీ పోచాకు లేదు

### నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బైరెడ్డి శబరి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 25– బైరెడ్డి కుటుంబాన్ని విమర్శించే అర్హత ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని కి లేదని నంద్యాల తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బైరెడ్డి శబరి పేర్కొన్నారు. నంద్యాల పార్లమెంట్ సభ్యులుగా గత ఇదేళ్ళు ఏమి అభివృద్ధి చేసావని మళ్ళీ నిన్ను గెలిపించాలని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బైరెడ్డి శబరి నిలదీశారు .గురువారం నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ . బైరెడ్డి శబరి ఎన్నికల కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయలసీమ అభ్యున్నతికి తన తండ్రి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి రాజీలేని పోరాటం చేస్తున్నారని, రైతులను మోసం చేసి అక్రమంగా ఆస్తులు కూడబెట్టుకున్న మీరు కూడా బైరెడ్డి కుటుంబాన్ని విమర్శలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని బైరెడ్డి శబరి అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రాష్ట్రానికి రెండు కళ్లలాంటివని, వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి నవరత్నాల పేరుతో జగన్మోహన్ రెడ్డి నవ మోసాలు చేశారని విమర్శించారు. మళ్ళీ జగన్ ప్రభుత్వం వస్తే రాష్ట్రాభివృద్ధి మరో 30 ఏళ్ళు వెనక్కు వెళ్లడమేనన్నారు. పాలనలో అనుభవం ఉన్న చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే అభివృద్ధి, సంక్షేమం సమానంగా ముందుకు సాగుతుందని బైరెడ్డి శబరి అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ పెరిగిపోతోందని, జగన్ పై ఎన్నో ఆశలుపెట్టుకున్న నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి లేక చెడు అలవాట్లకు బానిసై కుటుంబాలకు మానసిక వేదన కలిగిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం చెందిందని ఈ ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పబోతున్నారని ఆమె అన్నారు. నంద్యాల ఎంపీ తో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు టీడీపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# కర్నూలు పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన పిజి రాం పుల్లయ్య యాదవ్



కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా లక్కీటు పీజీ రాం పుల్లయ్య యాదవ్ గారు నామినేషన్ వేశారు. గురువారం ఉదయము జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కే బాబురావు గారితో కలిసి నామినేషన్ పత్రాలను జిల్లా రిటర్నింగ్ అధికారి గారైన కలెక్టర్ గారికి సమర్పించారు. అలాగే కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా షేక్ జిలాని భాష గారు నామినేషన్ వేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కే బాబురావు గారితో కలిసి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగారైన భార్గవ్ తేజ గారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం డిసిసి అధ్యక్షులు బాబురావు గారు పత్రిక ప్రకటన విడుదల చేస్తూ కాంగ్రెస్ పార్టీ స్వాతంత్రం కోసం పోరాడిన పార్టీ అని, ప్రాంతీయ పార్టీలతో అభివృద్ధి సాధ్యం కాదని ఒక జాతీయ కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధిసాధ్యమనికాంగ్రెస్‌పార్టీ హయంలో శాశ్వత పనులు చేపట్టడం జరిగిందని ప్రాజెక్టులు,విద్యాసంస్థలు, కర్మాగారాలు, బ్యాంకుల జాతీయకరణ, మొదలగు శాశ్వత పనులు ఒక కాంగ్రెస్ ప్రభుత్వంలోనే జరిగాయని ప్రాంతీయ పార్టీల చేతగా ని తనానికి ఉదాహరణ పోలవరం ప్రాజెక్టు అని పోలవరం ప్రాజెక్టును తెలుగుదేశం కానీ వైసీపీ గానీ ఇంతవరకు పూర్తి కాలేదంటే వారి ప్రభుత్వాల అసమర్ధ పాలనకు నిదర్శ నమని విమర్శించారు. మాట్లాడుతూ ప్రియత మ నాయకులు రాహుల్ గాంధీ గారు చేపట్టిన భారత్ జోడో యాత్రతో దేశ ప్రజలలో మార్పు వచ్చిందని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగిస్తుందని ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తెలియజేశారు. అనంతరం కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి షేక్ జిలాని భాషా గారు మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన గారి తప్పిందని వైసీపీ పాలనలో కక్ష సాధింపులు, హత్యలు, ప్రశ్నించిన వారిపై దాడులు అధికమ య్యాయని వచ్చే ఎన్నికల్లో షర్మిలమ్మ గారి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటుం దని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ పీజీ నరసింహులు యాదవ్, పీజీ లోక్‌నాథ్ యాదవ్, ఖాజా హుస్సేన్ వారి న్యాయవాదులు పాల్గొన్నారు.

# సమయపాలన పాటించండి

### నిరంజన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 25– మున్సిపల్ అధికారులు సిబ్బంది సమయపాలన పాటించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయం లో అధికారులు. కిందిస్థాయి సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మున్సిపల్ కార్యాలయం లో ఉండాలన్నారు. గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

# ఆస్తులు లెక్కలు....

## షర్మిల సైలెన్స్ పై అనుమానాలు

కడప, ఏప్రిల్ 25 సోదరుడు జగన్ను షర్మిల వ్యతిరేకించడానికి ప్రధాన కారణం ఆస్తి వివాదాలే. పిత్రార్జితంగా వచ్చిన ఆస్తిని తనకు పంచలేదన్న బాధ ఆమెలో ఉంది. అన్న రాజకీయ ఉన్నతి కోసం ఎంతో బాధపడ్డానని.. కానీ అధికారంలోకి వచ్చాక తమను పట్టించుకోవడం మానేశారని జగన్ పై షర్మిల ఆగ్రహంగా ఉన్నారు. రాజకీయంగా విభేదించడానికి అదే ప్రధాన కారణం. అయితే తాజాగా తన ఆఫిడవిట్లో అన్న, వదినల నుంచి అప్పు తీసుకున్నానని షర్మిల కొంత మొత్తాన్ని చూపడం వ్యూహంగా తెలుస్తోంది. ఆ అప్పులనే ఆస్తులుగా పరిగణించాలని జగన్ తేల్చి చెప్పి ఉండవచ్చు. అంతటితో సంతృప్తి పడాలని చెప్పి ఉండవచ్చు. అయితే షర్మిల మాత్రం మాటల్లో చెప్పలేని బాధను వ్యక్తం చేస్తున్నారు. తన పిల్లలకు ఏమీ ఇవ్వలేకపోయాను అన్న బాధ ఆమెలో కనిపిస్తోంది. అయితే ఆమె ముందు న్యాయపోరాటం ఆప్షన్ ఉంది. పిత్రార్జితంలో వాటా కూడా పొందే ఛాన్స్ కనిపిస్తోంది. కానీ ఆమె న్యాయపోరాటానికి ముందుకు రాకపోవడం విశేషం. అయితే అన్నతో విభేదాలు తారాస్థాయికి చేరాయి. చివరకు మేనల్లుడి వివాహానికి కూడా జగన్ వెళ్లలేని పరిస్థితికి అవి చేరుకున్నాయి. అయితే షర్మిల తాజా అఫిడవిట్లో అప్పుల వివరాలు ప్రస్తావించే సరికి వారి మధ్య ఆస్తి వివాదాలు మరోసారి ప్రస్తావనకు వచ్చాయి. అయితే షర్మిల ఇంతలా బాధపడే కంటే అన్న పై న్యాయపోరాటం చేస్తే న్యాయం జరిగేది. ఎన్టీఆర్ ఎప్పుడో ఆస్తిలో మహిళలకు సమాన హక్కు కల్పిస్తూ చట్టం తెచ్చారు. పిత్రార్జితంగా వచ్చిన ఆస్థిలో పిల్లలతో పాటు తల్లికి వాటా ఉంటుంది. అయితే వైయస్ ఆస్తులు ఏంటన్నది తెలియడం లేదు. సీఎం కాక మునుపు ఆయన హైదరాబాదులో ఇంటిని అమ్మకానికి చూపారు. కానీ ఆయన సీఎం అయిన తర్వాత కుమారుడు జగన్ రంగంలోకి దిగారు. పెద్ద ఎత్తున ఆస్తులు సమకూర్చుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ఆ ఆస్తులు పిత్రార్జితం కింద రావు. ఇప్పుడు షర్మిల పడుతున్న బాధ అదే. అలా వైయస్ సంపాదించిన ఆస్తులన్నీ ఇప్పుడు జగన్ చేతిలో ఉన్నాయి. అలాగని అవన్నీ పిత్రార్జితంగా చూపుతామంటే కాదు. జగన్ తనకు తానుగా ఉదార స్వభావంతో షర్మిలకు ఇస్తే ఏ ఇబ్బంది ఉండేది కాదు. కానీ సోదరికి ఇచ్చిన అప్పులనే ఆస్తులుగా చూసుకోవాలని చెప్పినట్టు ఉన్నారు. ఒకవేళ అది అప్పులు అయి ఉంటే.. విభేదాలు తారాస్థాయికి చేరుకున్న తరుణంలో ఏనాడో షర్మిల వాటిని తీర్చి ఉండేవారు కదా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.అయితే చాలా వరకు ఆస్తులను జగన్ సైతం తన అఫిడవిట్ లో చూపలేదు. లోటస్ పాండ్ ఎవరిది? తాడేపల్లి ప్యాలెస్ ఎవరిది? యలహంక ప్యాలెస్ ఎవరిది? బెంగళూరు మంత్రి మాల్ ఎవరిది? పులివెందుల, కడప నగరాల్లో భవనాలు ఎవరివి? అన్నది పొందుపరచలేదు. కానీ అవన్నీ అక్రమ మార్గంలో సమకూర్చుకున్నవన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే షర్మిల వాటిపై న్యాయపోరాటం చేయలేరు.

# హిందూపురంలో త్రిముఖ పోటీ

అనంతపురం, ఏప్రిల్ 25 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నుంచి బరిలోకి దిగుతానని పరిపూర్ణానంద స్వామీజీ పలుమార్లు చెప్పారు. హిందూపురం బీజేపీ అభ్యర్థిగా తానే పోటీలో ఉన్నానని సైతం చెప్పారు. కానీ టిడిపి, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా హిందూపురం నుంచి పరిపూర్ణానంద స్వామి అభ్యర్థిత్వం దాదాపు ఖరారైంది. కానీ అనుకొని పరిణామాలతో హిందూపురం పార్లమెంటు అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథికి ఛాన్స్ ఇవ్వడంతో పరిపూర్ణానంద స్వామీజీ తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. బీజేపీ అధిష్టానంతో చర్చల అనంతరం తన రాజకీయ భవిష్యత్తు ప్రకటిస్తానని చెప్పిన పరిపూర్ణానంద స్వామీజీ హిందూపురం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. హిందూపురం సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న నందమూరి బాలకృష్ణ గత రెండు ఎన్నికల్లో విజయం సాధించారు. ఈసారి ఎలాగైనా నెగ్గి, హ్యాట్రిక్ కొట్టాలని బాలయ్య భావిస్తున్నారు. అందుకు అనుగుణంగానే నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆయన సతీమణి వసుంధర దేవి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలపై ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తూ ఓట్లు అడుగుతున్నారు. చంద్రబాబు హయాంలోనే హిందూపురం నియోజకవర్గం అభివృద్ధి చెందిందంటూ బాలకృష్ణ సభల్లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ వస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలిచి తీరుతానని ఎమ్మెల్యే బాలకృష్ణ దీమా వ్యక్తం చేస్తున్నారు. హిందూపురం నియోజకవర్గంలో ఇప్పటివరకు వైసీపీ నెగ్గలేదు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కూడా తెలుగుదేశం పార్టీ అభ్యర్థులే హిందూపురంలో ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఈసారి ఎలాగైనా హిందూపురంలో వైసిపి జెండా ఎగరేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఇన్చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. హిందూపురం వైసీపీ అభ్యర్థిగా కురుబ సామాజిక వర్గానికి చెందిన దీపికా రెడ్డి ఈసారి వైసీపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాలే తమను గెలిపిస్తాయని అభ్యర్థి దీపికా రెడ్డి విస్తృతంగా ప్రచారం చేస్తూ ముందుకు సాగుతున్నారు.హిందూపురం పార్లమెంట్ నుంచి పోటీ చేయాలన్న ఆశలు గల్లంతు కావడంతో స్వామీజీ కీలక నిర్ణయం తీసుకున్నారు. హిందూపురం పార్లమెంటు నియోజకవర్గానికి తెలుగుదేశం పార్టీ నేత బికే పార్థసారని కూటమి అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన పరిపూర్ణానంద స్వామీజీ హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. గత ఆరు నెలలుగా హిందూపురం వ్యాప్తంగా స్వామీజీ తన ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం నియోజకవర్గంలో హిందుత్వాన్ని బోధిస్తూ హిందూపురంలో యువతకు ఉపాధి కల్పించే దిశగా తాను కృషి చేస్తానంటూ ప్రజలకు హామీలు ఇస్తున్నారు. ఇప్పటివరకు హిందూపురంలో తెలుగుదేశం, వైసిపి పార్టీల మధ్య ప్రధాన పోటీ అని అంతా అనుకున్నారు. అయితే ఇండిపెండెంట్ అభ్యర్థిగా పరిపూర్ణానంద స్వామీజీ నామినేషన్ వేయడంతో త్రిముఖ పోరు మొదలైంది. అయితే పరిపూర్ణానంద స్వామీజీ.. బాలకృష్ణ ఓట్లు చీల్చుతారా, లేక వైసీపీ వర్గీయుల ఓట్లు క్యాష్ చేసుకుంటారా అనేది నియోజకవర్గంలో హాట్ టాపిక్ గా మారింది.

# ఓ వైపు కరెంట్... మరో వైపు నీరు



గుంటూరు, ఏప్రిల్ 25 ఏపీలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. రాష్ట్రంలో వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ పంపిణీ సంస్థల్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.విద్యుత్ సరఫరా పరిస్థితులపై ఇంధన శాఖ అధికారులతో సిఎస్ సమీక్షించారు. విద్యుత్ డిమాండుకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే వెంటనే స్పందించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ ఏడాది జూన్ వరకూ ఎదురయ్యే విద్యుత్ డిమాండుకు అనుగుణంగా విద్యుత్ సరఫరాకు తగిన విధంగా విద్యుత్ ఉత్పత్తికి సరఫరాకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా వీలైనంత వరకూ విద్యుత్ కోతలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు.ఈ ఏడాది జూన్ వరకూ రోజు వారీ విద్యుత్ డిమాండు ఏవిధంగా ఉంటుందనేది అంచనా వేశారు. ఏప్రిల్ నెలలో 245 మిలియన్ యూనిట్లు, మేలో 236 మిలియన్ యూనిట్లు, జూన్ లో 253 మిలియన్ యూనిట్లు ఉంటుందని అంచనా వేసినట్టు అధికారులు వివరించారు.రాష్ట్రంలో ప్రస్తుతం రోజుకు సరాసరిన 245 నుండి 250 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోందని వివరించారు. విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్ ను సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.వినియోగదారుల నుండి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం జరుగుతోందని సిఎండి తెలిపారు.సాధ్యమైనంత వరకూ విద్యుత్ డిమాండుకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు చెప్పారు. వివిధ విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో రోజువారి బొగ్గు నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్టు సిఎస్‌కు వివరించారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదులను ఆయా విద్యుత్ పంపిణీ సంస్థలు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తికి అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని సిఎస్



ఆదేశించారు.రాష్ట్రంలో తాగునీరు, ఉపాధి హామీ పనులు, నీటి సరఫరా, విద్యుత్ సరఫరా పరిస్థితులపై సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి పనులు నిర్వహించిన కూలీలకు సకాలంలో కూలి సొమ్ము చెల్లించాలని చెప్పారు.ప్రకాశం బ్యారేజి నుండి మరియు నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ ద్వారా విడుదల చేసిన నీటితో సకాలంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లను సిఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు.గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి గల ఆవాసాలు,కాలనీలకు ట్యాంకులు ద్వారా మంచినీటిని సరఫరా చేసే ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించి ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా సకాలంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సిఎస్ స్పష్టం చేశారు.

# రూ.20లకే రైల్వే ఎకానమీ మీల్స్....

తిరుపతి, ఏప్రిల్ 25 దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు రైల్వే స్టేషన్లలో రూ.20కే భోజనం కొనుగోలు చేసే సదుపాయాన్ని ఐఆర్‌సిటిసి ప్రారంభించింది. రైలు ప్రయాణాల్లో భోజనం చేయాలంటే జేబులు ఖాళీ కావడంతో పాటు నాణ్యత లేని నాసిరకం భోజనాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చేది. ప్రయాణికుల్ని నిలువు దోపిడీకి గురి చేస్తుండటంపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో కొద్ది రోజులుగా తక్కువ ధరలకే నాణ్యమైన ఆహారాన్ని విక్రయించే విషయంలో ఐఆర్‌సిటిసి ప్రయోగాలు చేస్తోంది.దక్షిణ మధ్య రైల్వే పరిధిలో విజయవాడ డివిజన్‌లోని విజయవాడ ు రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో భోజనం తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. రైలు ప్రయాణీకులకు సరసమైన, నాణ్యమైన మరియు పరిశుభ్రమైన ఆహారాన్ని అందిస్తుందని చెప్పారు. ఈ భోజనాలు ప్లాట్‌ఫారమ్‌లపై జనరల్ కోచ్‌ల దగ్గర అందుబాటులో ఉంచుతున్నట్టు అధికారులు ప్రకటించారు.రైలు ప్రయాణీకులకు నాణ్యమైన, సరసమైన మరియు పరిశుభ్రమైన భోజనాన్ని అందించడానికి, భారతీయ రైల్వేలు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్తో కలిసి "ఎకానమీ మీల్స్" ప్రవేశపెట్టాయి.వేసవిలో ప్రయాణీకుల రద్దీని అంచనా వేస్తూ, రైలు ప్రయాణీకుల్లో ముఖ్యంగా జనరల్ కోచ్‌లలో ప్రయాణించే వారికి సరసమైన ధరలో రెండు రకాల భోజనాలు అందిస్తున్నారు. ఈ రకం భోజన కౌంటర్లు భారతీయ రైల్వేలలో 100కి పైగా స్టేషన్లలో దాదాపు 150 కౌంటర్ల ద్వారా అందిస్తున్నారు.దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఎకానమీ మీల్స్ సదుపాయాన్ని 12 స్టేషన్లలో అందిస్తున్నారు. ప్రయాణీకులకు ఈ భోజనాన్ని అందించడానికి 23 కౌంటర్లు ఏర్పాటు చేవారు.ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రల్లోని హైదరాబాద్, విజయవాడ, రేణిగుంట, గుంతకల్, తిరుపతి, రాజమండ్రి, వికారాబాద్, పాకాల, ధోనే, నంద్యాల, పూర్ణ, ఔరంగాబాద్ రైల్వే స్టేషన్లలో ఎకానమీ మీల్స్ అందుబాటులో ఉంటాయి.విజయవాడ డివిజన్‌లో, విజయవాడ, రాజమండ్రి స్టేషన్‌లలో రిఫ్రెష్‌మెంట్ రూమ్‌లతో పాటు జన్ ఆహార్ యూనిట్లలో కూడా రూ.20కే భోజనం విక్రయిస్తున్నారు.ప్రయాణికులపై ఏ మాత్రం భారం పడకుండా రూ. 20లకే ఈ భోజనాలను విక్రయిస్తారు. ప్రయాణీకులకు సంతృప్తికరమైన భోజనం తక్కువ ధరకే లభిస్తుందని చెబుతున్నారు.తేలికపాటి భోజనం కోరుకునే వారికి రూ. 50/- స్నాక్ మీల్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా, ఎకానమీ మీల్స్ కొనుగోలు చేయడానికి వీలుగా ప్లాట్‌ఫారమ్‌లలో సాధారణ సెకండ్ క్లాస్ కోచ్‌ల దగ్గర ఉండే కౌంటర్లలో ఈ భోజనం, తాగు నీరు అందుబాటులో ఉంచుతున్నారుప్రయాణికులు నేరుగా ఈ కౌంటర్ల నుండి వారికి కావాల్సిన భోజనం కొనుగోలు చేయొచ్చు. గత ఏడాది దేశ వ్యాప్తంగా దాదాపు 51 స్టేషన్లలో విజయవంతంగా ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో భారతీయ రైల్వేలు ఈ కార్యక్రమాన్ని గణనీయంగా విస్తరించినట్టు విజయవాడ డిఆర్ఎం తెలిపారు.దేశంలో 100 స్టేషన్లలో దాదాపు 150 సేల్స్ కౌంటర్లు పని చేస్తున్నాయి. సమీప భవిష్యత్తులో మరిన్ని స్టేషన్‌లకు ఈ సేవల్ని విస్తరిస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రయాణ సమయంలో సౌలభ్యంతో పాటు ప్రజలకు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన ఆహారాన్ని అందించడమే ఎకానమీ మీల్స్ లక్ష్యమని డిఆర్ఎం నరేంద్ర పాటిల్ చెప్పారు.ఎకానమీ మీల్ ప్యాక్‌లో 175 గ్రాముల బరువైన ఏడు పూరీలు, ఆలూ వెజ్ ఫ్రై, చిన్న పచ్చడి ప్యాకెట్ రూ.20కే అందిస్తారు.ఎకానమీ మీల్స్‌లో 200గ్రాముల లెమన్ రైస్ విత్ పికెల్, కర్డ్ రైస్ విత్ పికెల్, పులిహోరను కూడా రూ.20కే విక్రయిస్తారు.స్నాక్ కంబో మీల్స్‌లో ప్రాంతాల వారీగా అందుబాటులో ఉండే ఆహారాన్ని రూ.50కు విక్రయిస్తారు.

# లారీని ఢీకొన్న కారు..ఆరుగురు మృతి

కోదాడ,సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని దుర్గాపురం స్టేజి వద్ద జాతీయ రహదారిపై తెల్లవారుఝామున భారీ ప్రమాదం చోటు చేసుకుంది. లారీని వెనక నుండి కారు ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు మృతి చెందారు. కారులో నలుగురు పురుషులు, ఒక మహిళ పాప వున్నారు. వీరు హైదరాబాదు నుండి విజయవాడ వెళుతున్నట్టు గా తెలుస్తుంది.. బ్రేక్ డౌన్ అయిన లారీ రోడ్డుపై హైవే పక్కనే నిలబడంతో ఈ ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక సమాచారం. గత మూడు రోజుల క్రితం కూడా ఇదే విధంగా టిప్పర్ కారు ఢీకొనడంతో యువ జంట మృతి చెందిన సంఘటన మరువకముందే మరోసారి కోదాడ ప్రాంతంలో ప్రమాదం జరగడం దురదృష్టకరం. వేసవి కావడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లేవాళ్లు రాత్రిపూట ప్రయాణం చేయడం, రోడ్డుపై ఆగి ఉన్న వాహనం గమనించకపోవడంతో ఈ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

# ఎన్నికలలో సూపర్ స్టార్ ను లాగొద్దు

హైదరాబాద్, ఏప్రిల్ 25 ఎన్నికల ప్రసంగంలో పవన్ కల్యాణ్ ..సూపర్ స్టార్ కృష్ణను విమర్శించారని తెలిసిన షాక్ కు గురయ్యారని నటుడు నరేష్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. కృష్ణ గారి మనసు బంగారమన్నారు. పార్లమెంటు సభ్యుడిగా నైతిక విలువలకు పెద్దపీట వేశారని.. సినీ రంగానికి, రాజకీయ రంగానికి ఆయన అందించిన సేవలు గొప్పవన్నారు. కృష్ణ తన రాజకీయ ప్రసంగాల్లో ఎప్పుడూ వ్యక్తిగతంగా ఎవర్నీ కించపర్చలేదన్నారు. భవిష్యత్ లో అలాంటి మాటలు ఇక పవన్ అనవద్దని పవన్ను కోరారు. ఓ నటుడిగా, రాజకీయ నాయకుడిగా పవన్ కల్యాణ్ అంటే తనకెంతో గౌరవం ఉందని నరేష్ తెలిపారు. పవన్ లో తాను ఏపీ భవిష్యత్ ను చూస్తున్నాను అని నరేశ్ మరో ట్వీట్ లో వెల్లడించారు. ఏపీకి పునర్ వైభవం కల్పించేందుకు ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించాలని బీజేపీ మాజీ యువజన అధ్యక్షుడిగా, పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శిగా కోరుకుంటున్నానని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొంటున్న పవన్ కల్యాణ్.. తనపై వైసీపీ నేతలు చేస్తున్న వ్యక్తిగత దూషణల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా గతంలో రాజకీయ నేతలు ఎంత హుందాగా ఉండేవారో చెప్పుకొచ్చారు. అలాంటి హుందా రాజకీయాల్లో కృష్ణ – ఎన్టీఆర్ మధ్య జరిగిన రాజకీయాల్ని ప్రస్తావించారు.అప్పట్లో ఎన్టీఆర్ కు వ్యతిరేకంగా సూపర్ స్టార్ కృష్ణ కాంగ్రెస్ లో ఉండేవారని, ఎన్టీఆర్ ను కృష్ణ విమర్శించినా... ఎన్టీఆర్ ఎప్పుడూ కృష్ణను పల్లెత్తు మాట అనలేదని అన్నారు. అయితే ఇలా ప్రసంగించి నాలుగు రోజులు దాటిపోయిన తర్వాత నరేష్ స్పందించారు. నరేష్ తల్లి విజయనిర్మల, కృష్ణ భార్య భర్తలు. నరేష్ తో తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగరిరావు చాలా సార్లు ప్రకటించారు. ఇప్పుడు ఈ అంశంలో పవన్ కల్యాణ్ .. సూపర్ స్టార్ కృష్ణను ఏమీ విమర్శించకపోయినారాజకీయాల గురించి మాత్రమే ప్రస్తావించినా..ఏదోవివాదంఉందన్నట్లుగా ట్వీట్ చేయడం దుమారం రేగుతోంది. నరేష్ అటెన్షన్ కోసం ప్రసంగించిన ఐదు రోజుల తర్వాత స్పందించారు. అంతే కాదు ఓ వైసీపీ సానుభూతిపరుడి వీడియోను షేర్ చేశారు.

# 62 వేల మంది వలంటీర్ల రాజీనామా

## కోర్టుకు చేరిన కథ

విజయవాడ, ఏప్రిల్ 25 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో వాలంటీర్ల అంశం కీలకంగా మారింది. ఇప్పుడీ విషయం హైకోర్టుకు కూడా చేరింది. ఎన్నికల ప్రక్రియలో వాలంటీర్లను దూరంగా ఉంచాలని ఎన్నికల సంఘం ఆదేశించడంతో వారిలో చాలా మంది రాజీనామాలు చేస్తున్నారు. వారితో వైసీపీ నేతలు బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల్లో వారిని బూత్ ఏజెంట్లుగా పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అంటున్నారు. ఈ క్రమంలో బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ హైకోర్టులో వాలంటీర్ల రాజీనామాలను ఆమోదించకుండా చూడాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై హైకోర్టులో వాదనలు జరిగాయి. వాదనల సందర్భంగా 62 వేల మంది వాలంటీర్లు ఇప్పటి వరకూ రాజీనామా చేశారని ఈసీ తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. అలాగే రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నందున 900 మంది వాలంటీర్లపై చర్యలు తీసుకున్నామన్నారు. రాజీనామా చేసిన వాలంటీర్ల విషయంలో ఈసీ ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదన్నారు. రాజకీయ కారణాలతోనే వాలంటీర్లతో రాజీనామాలు చేయిస్తున్నారని వారితో పార్టీ ప్రచారం చేయించుకుంటున్నందున రాజీనామాలను ఆమోదించకుండా చూడాలని పిటిషన్ తరపు న్యాయవాది కోరారు. అయితే రాజీనామాలు చేసిన వారిపై ఈసీకి ఎలాంటి అదుపు ఉండదని ఈసీ తరపు లాయర్ స్పష్టం చేశారు. కానీ ఆర్టికల్ 324 ప్రకారం ఈసీకి సర్వాధికారాలు ఉంటాయని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై సమగ్రమైన అఫిడవిట్ దాఖలు చేయాలని ఈసీని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. ఏపీలో రెండున్నర లక్షల మంది వాలంటీర్లు ఉన్నారు. వారు అధికార పార్టీ కోసం పని చేస్తున్నారన్న ఆరోపణలు చాలా రోజుల నుంచి ఉన్నాయి. ఎన్నికల సమయంలో ఓటర్లను బెదిరిస్తారన్న ఫిర్యాదులు వెళ్లడంతో వారి ద్వారా ఎలాంటి ప్రభుత్వ పథకాలు ఓటర్లకు చేరకూడదని.. ఈసీ ఆదేశించింది. ఎన్నికల ప్రక్రియలో వారి పనితీరును నిలువరించింది. వాలంటీర్లు అంతా వైసీపీ కార్యకర్తలేనని ఆ పార్టీ నేతలు చెబుతూ ఉంటారు. ఈ క్రమంలో వాలంటీర్లతో వైసీపీ నేతలు రాజీనామాలు చేయిస్తున్నారు. వారిని ఎన్నికల ప్రచారంలో వినియోగించుకోవడంతో పాటు బూత్ ఏజెంట్లుగా పెడతామని ప్రకటిస్తున్నారు. వాలంటీర్లు ప్రతి యాభై ఇళ్లకు ఒకరు ఉంటారు. వారు బూత్ ఏజెంట్లుగా కూర్చుంటే.. ఓటు వేయడానికి వచ్చిన వారికి ఇబ్బందికర పరిస్థితులు ఉంటాయని.. ఓటర్లను బెదిరిస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే వారిని పోలింగ్ బూత్ లలోకి వెళ్లకుండా నియంత్రించేందుకు ఇతర పార్టీలు న్యాయపోరాటం చేస్తున్నాయి.

# అభివృద్ధికి పట్టం కట్టండి

## - బుట్టా ప్రతుల్ జగన్మోహన్ రెడ్డి మళ్ళీ సీఎం చేద్దాం

ఎమ్మిగనూరు ఏప్రిల్ 25పట్టణంలో గడప గడప ప్రచారం సాయంత్రం గోనెగండ్ల మండలంలోని శ్రీరామ్ నగర్ నందు బుట్టా ప్రతుల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ యువనేత బుట్టా ప్రతుల్ ప్రజా నాయకురాలు వైయస్సార్సీపి ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి బుట్టా రేణుక గారిని ఆదరించి,పట్టం కట్టాలని శ్రీమతి బుట్టా రేణుక గారి కుమారుడు యువనేత బుట్టా ప్రతుల్ గడప గడపకు తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరించారు.×ఈ కార్యక్రమంలో గోనెగండ్ల మండలం యూత్ అధ్యక్షులు బందేనవాజ్, యువ నాయకులు రవి కుమార్ నాయుడు,మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మన్సూర్,సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి,మండల కన్వీనర్ దొరబాబు,మురళీ నాయుడు మరియు వారి అనుచరులు వైకాపా పార్టీ ముఖ్యనేతలు,నాయకులు, అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

# మచిలీపట్నంలో కూటమి అభ్యర్థుల నామినేషన్ హాల్ చల్

మచిలీపట్నం,గురువరం నాడు కలెక్టరేట్ లో కూటమి ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి కొల్లు రవీంద్ర నామినేషన్ వేసారు. ముందుగా సుల్తానగరం ఆంజనేయస్వామి గుడిలో పూజల అనంతరం ర్యాలీగా కలెక్టరేట్ కుబయలుదేరారు. మూడు స్తంభాల సెంటర్ కోనేరు సెంటర్,రేవతి సెంటర్, లక్ష్మీ టాకీస్ సెంటర్ మీదుగా కలెక్టరేట్కు ర్యాలీగా బయలుదేరారు. నామినేషన్ మహోత్సవానికి ప్రజలు అశేషంగా తరలి వచ్చారు. నగర ప్రధాన వీధులు పసుపు, ఎరుపుమయమైయాయి.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తోనే రాష్ట్ర అభివృద్ధి వై విశ్వేశ్వర్ రెడ్డి



అనంతపురం ప్రతినిధి విభారే న్యూస్ ఏప్రిల్ 25 ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఒక వైఎస్ జగన్మోహన్ రెడ్డి తోనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని ఉరవకొండ వైసీపీ అభ్యర్థి వై విశ్వేశ్వర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా గురువారం ఉరవకొండ నియోజకవర్గం మండల కేంద్రంలోని స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నటువంటి నాయకులతో కలిసి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గురించి వివరిస్తూ భవిష్యత్తులో వచ్చే పథకాల గురించి కూడా వివరిస్తూ ఆయన వాళ్ళలో ఉత్సాహాన్ని నిలిపారు అంతేకాకుండా ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే కొత్త పథకాలు కూడా శ్రీకారం చుడతామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నియోజకవర్గ నాయకులు మండల నాయకులు తదితర కార్యకర్తల పాల్గొన్నారు

# ఫరూక్ , బైరెడ్డి సమక్షంలో టిడిపిలోకి వలసల పరంపర



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 25–రాబోయే ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగిస్తుందన్న సంకేతాల నేపథ్యంలో నంద్యాలలో టిడిపిలోకి భారీగా వలసల పరంపర కొనసాగుతోంది. ఈ సందర్భంగా ×టిడిపి రాష్ట్ర కార్యదర్శి అడ్వకేట్ రామచంద్ర రావుగారి ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు మరియు రాయలసీమ రీజినల్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, బలిజ కాపు సేవా సమితి వ్యవస్థాపకులు దండే దస్తగిరి మరియు వైసీపీ నంద్యాల టౌన్ యూత్ జనరల్ సెక్రటరీ , బలిజ కాపు సేవా సమితి ప్రధాన కార్యదర్శి దండే వెంకట నరేష్ వారితోపాటు 200 మంది గురువారం వైసీపీని వీడి మాజీ మంత్రివర్యులు నంద్యాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్ , నంద్యాల టిడిపి ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి , నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ దండే దస్తగిరి గారు దాదాపు 20 సంవత్సరాల నుంచి శిల్పా కుటుంబాన్నికి విధేయుడుగా ఉంటూ వారు చేసే కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనడం జరిగిందన్నారు. అలాగే వారి కుమారుడు దండే వెంకట నరేష్ కూడా వైసిపి లో యూత్ జనరల్ సెక్రటరీగా చాలా క్రియాశీలకంగా పని చేయడం జరిగిందని అయినా కూడా శిల్పా కుటుంబం వారిని విస్మరించి వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో అసహనానికి లోనైన వారు గురువారం వైసీపీని వీడి పెద్ద ఎత్తున టిడిపిలో చేరడం అనేది చాలా శుభ పరిణామం అన్నారు. శిల్పా , శిల్పా కుటుంబాన్ని నమ్ముకున్న నాయకులను కార్యకర్తలను ప్రజలను విస్మరించడమే వారు పనిగా పెట్టుకున్నారని వారికి గౌరవం ఇవ్వడం లేదన్నారు . అంతేకాకుండా వారి విధి విధానాలు నచ్చగా చాలామంది వైసిపి నాయకులు వైసిపిని వీడి టిడిపిలో చేరుతున్నారని . అలాగే జగన్ పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు అన్నివర్గాల ప్రజలు కలసి రావాలని చంద్రబాబు నాయుడు గారిని సీఎం గా చేసుకోవాలని ప్రజల్ని కోరారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం కలసివచ్చే వారందరికీ తెలుగుదేశం పార్టీ ద్వారాలు తెరిచే ఉంటాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక కొత్తగా వస్తున్న వారి సేవలను వినియోగించుకుంటామని చెప్పారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఏ వి ఆర్ ప్రసాద్ , రాజారాం , ఎల్ఐసి రామయ్య , పుసులూరు పుల్లయ్య , నంద్యాల టౌన్ టిడిపి అధ్యక్షులు మునియార్ ఖలీల్ , సూలం శ్రీనివాసులు (బుజ్జి) , నూనెపల్లె విగ్నేష్ , జనసేన నాయకులు సుధాకర్ , రవి తదితరులు పాల్గొన్నారు.

# నాటుసారా స్థావరాలపై సెబ్ పోలీసుల దాడులు....



కర్నూలు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 విభారె న్యూస్.ఈ దాడులలో మొత్తం 8 వేల 9 వంద లీటర్ల నాటుసారా ఊటబెల్లం, 170 లీటర్ల నాటుసారా ధ్వంసం.పత్తికొండ లో 5 వేల 2 వందల లీటర్ల నాటుసారా ఊట బెల్లం, 100 లీటర్ల నాటుసారా ధ్వంసం.కర్నూలులో 3 వేల 7 వందల లీటర్ల నాటుసారా ఊట బెల్లం , 70 లీటర్ల నాటుసారా ధ్వంసం.ఇద్దరు అరెస్టు.దాడులలో పాల్గొన్న పోలీసులను అభినందించిన కర్నూలు జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఐపియస్.కర్నూలు జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఐపియస్ ఆదేశాల మేరకు కర్నూలు సెబ్ ఎన్ ఫోర్స్ మెట్ ఇంచార్జ్ అడిషనల్ ఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో కర్నూలు సెబ్ సూపరింటెండ్ ఎస్. రవి కుమార్ పర్యవేక్షణలో అక్రమంగా నాటుసారా తయారీ,నిల్వ ,అక్రమ మద్యం,అక్రమ రవాణా, అమ్మకాలపై పత్తికొండ, కర్నూలు పోలీసులు ఈ రోజు విస్తృతంగా దాడులు నిర్వహించారని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా నాటుసారా నిర్మూలనకు కర్నూలు సెబ్ పోలీసులు నాటుసారా స్థావరాల పై విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. పత్తికొండ సెబ్ పోలీస్ లు , పత్తికొండ సెబ్ స్టేషన్ పరిధి లోని పెండ్లిమాన్ తండా, మద్రిమాను తండ మాన్సింగ్ తండా గ్రామాల యందు నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు.ఈ దాడులలో 5 వేల 2 వందల లీటర్ల నాటుసారా ఊట బెల్లం,100 లీటర్ల నాటు సారా ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు.కర్నూల్ సెబ్ పోలీసు లు కర్నూలు పట్టణం లోని బంగారు పేట లో నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు.ఈ దాడులలో 3 వేల 7 వందల లీటర్ల నాటుసారా ఊట బెల్లం ,70 లీటర్ల నాటు సారా ధ్వంసం చేశారు. ఇద్దరిని అరెస్టు చేశారు.10 లీటర్ల నాటు సారా ను స్వాధీన పరచుకుని కేసులు నమోదు చేయడమైనది. ప్రజారోగ్యానికి హాని కలిగించే అక్రమ నాటుసారా తయారీ, అక్రమంగా మద్యం రవాణా, విక్రయాలకు పలుమార్లు పాల్పడే వ్యక్తులపై పిడి యాక్టులు నమోదు చేయడం జరుగుతుందని కర్నూలు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఐపియస్ ఈ సంధర్భంగా హెచ్చరించారు.ఈ దాడులలో కర్నూలు సెబ్ సిఐ రాజేంద్ర,డిటిఎస్ సిఐ నరసనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల స్పందనే టిడిపి గెలుపుకు నిదర్శనం..

**కర్నూలు టిడిపి అభ్యర్థి టి.జి భరత్.. పెద్ద మార్కెట్ నుండి మున్సిపల్ ఆఫీస్ వరకు టి.జి భరత్ భారీ ర్యాలీ.. వేలాదిగా తరలివచ్చిన ప్రజలు.. పసుపుమయమైన నగరం**









కర్నూలు ప్రజల స్పందన తన విజయానికి సంకేతమని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టి.జి భరత్ అన్నారు. నగరంలోని పెద్ద మార్కెట్ వద్ద నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ఆయన తన తండ్రి, మాజీ రాజ్యసభ సభ్యులు, బీజేపీ నేత టి.జి వెంకటేష్తో పాటు నేతలందరితో కలిసి భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం జనసేన ఇంచార్జి అర్షద్, బీజేపీ కన్వీనర్ సూర్యప్రకాష్, లోక్‌సత్తా పార్టీ నేత బ్రహ్మేశ్వర్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకుడు రెడ్డిపోగు భాస్కర్ మాదిగ, టిడిపి నేత, మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రెవరెండ్ దేవ సహాయం, కల్కూర చంద్రశేఖర్‌తో కలిసి టి.జి భరత్ నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి అందజేశారు. అనంతరం మీడియాతో టి.జి భరత్ మాట్లాడుతూ ఎన్డీయే కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించేందుకు ప్రజలు తరలిరావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఐదేళ్ల పాటు ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. మంచి చేసే నాయకుడిని, ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలన్న తపన ప్రజల్లో ఉందని తెలిపారు. స్వచ్ఛందంగా తరలివచ్చిన జన సునామీని చూస్తుంటే భారీ విజయం తథ్యమని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. కర్నూల్లో పదేళ్లుగా తాము పవర్‌లో లేకపోయినా ప్రజా సేవలో ఉన్నామని తెలిపారు. ఈ ఐదేళ్ల పాలనలో ఏ వీధికి వెళ్లినా సమస్యలే ఉన్నాయని పేర్కొన్నారు. తెదేపా సూపర్ 6 పథకాలతో పాటు తన ఆరు గ్యారెంటీలను అమలు చేసి కర్నూలు ప్రజల కష్టాలు తీరుస్తానని భరత్ హామీ ఇచ్చారు. ఒక్క అవకాశం అంటూ 2019లో గెలిచిన వైసీపీ ఐదు సంవత్సరాల కాలంలో అన్ని వర్గాలను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. అన్నీ గమనించిన ప్రజలు ఈ సారి తమ పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ముస్లింలు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బీజేపీతో టిడిపి కలిసి ఉన్న ఐదేళ్ల కాలంలో రంజాన్ తోఫా, దుల్హన్ పథకం అందరికీ అందించినట్లు వివరించారు. ఈ ఐదేళ్లలో ముస్లింల కోసం ఈ సంక్షేమ పథకాలు ఎందుకు కొనసాగించలేదని ఆయన ప్రశ్నించారు. కులం పేరుతో ఓట్లు అడిగే వైసీపీని పక్కనపెట్టి.. ఎలా అభివృద్ధి చేస్తామో చెబుతూ ఓట్లు అడుగుతున్న మమ్మల్ని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. తాను గెలిచిన తర్వాత ఐదేళ్లలో కర్నూల్ ప్రజల త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానన్నారు. టి.జి భరత్ ర్యాలీకి కదిలొచ్చిన కర్నూలుపెద్ద మార్కెట్ నుండి కొండారెడ్డి బురుజు, జిల్లా కోర్టు, కొత్తపేట నాలుగు రోడ్లు, శ్రీ లక్ష్మి స్కూల్ మున్సిపల్ ఆఫీసు సమీపం వరకు ర్యాలీ సాగింది. భారీ జన సందోహం మధ్య టి.జి భరత్ చైతన్యరథం ఎక్కి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ ప్రారంభం నుండి చివరిదాకా ప్రజలందరూ టి.జి భరత్ వెంటే ఉన్నారు. టిడిపి, జనసేన, బీజేపీ, లోక్‌సత్తా, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీకి తరలివచ్చారు. టి.జి భరత్ దారి పొడవునా ప్రతి ఒక్కరికీ నమస్కరిస్తూ ముందుకు సాగారు. నాయకులు, అభిమానులు ప్రధాన కూడళ్ల వద్ద గజమాలలు వేసి, టెంకాయలు కొట్టి టి.జి భరత్‌కు ఘన స్వాగతం పలికారు. దారి పొడవునా కార్యకర్తలు, అభిమానులు నీరాజనాలు పలికారు. ఎండను సైతం లెక్కచేయకుండా మహిళలు ర్యాలీలో పాల్గొని టి.జి భరత్‌కు మద్దతు తెలిపారు. ఈ ర్యాలీలో టి.జి భరత్ కుమారుడు టి.జి విభు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ర్యాలీలో భాగంగా నేతలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ర్యాలీలో మాజీ రాజ్యసభ సభ్యులు, బీజేపీ నేత టి.జి వెంకటేష్, టిడిపి ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జనసేన ఇంచార్జి అర్షద్, బీజేపీ కన్వీనర్ సూర్యప్రకాష్, కార్పోరేటర్లు, మాజీ కార్పోరేటర్లు, వార్డు ఇంచార్జీలు, క్లస్టర్ ఇంచార్జీలు, బూత్ ఇంచార్జీలు, టి.జి అభిమానులు, తదితరులు పాల్గొన్నారు

# నిబంధనల ఉల్లంఘనలపై సమాచారం అందించండి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె శ్రీనివాసులు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 25–సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎవరైనా ఎన్నికల సాధారణ పరిశీలకులకు ఫిర్యాదులు లేదా సమాచారం ఇవ్వవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గం, శ్రీశైలం, నందికొట్కూరు, పాణ్యం, డోన్ అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులుగా పంకజ్ కుమార్, ల్యాండ్ లైన్ ఫోన్ నెంబర్ 08514-293917 కు ఫోన్ చేయవచ్చన్నారు.నంద్యాల. అర్లగడ్డ . బనగానపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులుగా అన్నవి దినేష్ కుమార్, ల్యాండ్ లైన్ ఫోన్ నెంబర్ 08514 - 293910 కు సమాచారాన్ని ఇవ్వవచ్చన్నారు. అలాగే శాంతి భద్రతల కు శంకర్ త్రివేది ల్యాండ్ లైన్ నెంబర్ 08514-293913కు ఫోన్ చేయవచ్చు అని అన్నారు.



# లిబరల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గా వీ. చాందినీ రెడ్డి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 25– నంద్యాల కలెక్టర్ ఛాంబర్ లో గురువారం లిబరల్ కాంగ్రెస్ పార్టీ తరపున నంద్యాల పార్లమెంట్ స్థానానికి వీ. చాందినీ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా కలెక్టర్ మరియు రిటర్నింగ్ అధికారికి లిబరల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. వీ.చాందినీ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చిందని అన్నారు. నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గంలో నన్ను గెలిపిస్తే నిరుద్యోగ సమస్య రాకుండా చేస్తానని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుంటానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున అభిమానులు. మహిళలు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**